
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 8 నవంబరు 2024



పంటల బీమాను వినియోగించుకోవాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి జీడి పంటల బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. 'ఎకరాకు రైతులు రూ.1,600 చొప్పున ప్రీమియం చెల్లిస్తే.. రూ.32వేలు బీమా వర్తిస్తుంది. ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలి. రుణాలు తీసుకున్న బ్యాంకుల్లోనే ఇన్స్యూరెన్స్ చేస్తారు. రుణాలు తీసుకోని రైతులు, సొంతంగా బీమా చేయించుకునేవారు నేషనల్ క్రాప్ ఇన్స్యూరెన్స్ వెబ్‌పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 94403 89005 నెంబర్‌ను సంప్రదించాల'ని కలెక్టర్ సూచించారు.



సంతోషంతో ప్రదీప్తిని ముద్దాడుతున్న తల్లిదండ్రులు అప్పారావు, సుగుణవేణి

ఇద్దరూ ఇద్దరే!

- అక్క పోలీసు విభాగంలో... చెల్లెలు రక్షణ దళంలో..
- లక్ష్యసాధనలో విజయం సాధించిన ప్రదీప్తి, ప్రతిభ

ఆమదాలవలస, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ అక్కాచెల్లెళ్లు. ఉపాధ్యాయులుగా ఎంతోమంది జీవితాలను తీర్చిదిద్దిన తమ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్ఫూర్తిదాయకమైన కొలువులు సాధించారు. ముందు చెల్లెలు రక్షణ దళంలో ఉద్యోగం సాధించగా.. ఆమెను ఆదర్శంగా తీసుకుని అక్క కూడా సివిల్స్‌కు ప్రిపేర్ అయింది. డీఎస్పీగా ఎంపికై.. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని.. బెస్ట్ ఇండోర్ మెడల్‌తో పాటు రాష్ట్ర హోంమంత్రి నుంచి ట్రోఫీని అందుకుంది. లక్ష్యసాధనలో ఎంతోమందికి ఆదర్శంగా నిలిచిన అక్కాచెల్లెళ్ల విజయగాథ వివరాలు..

6లో

వృద్ధులూ... ఆయుష్మాన్ భవ!

- 70 ఏళ్లు పైబడిన వారికి ఆరోగ్య బీమా
- ఆస్పత్రుల్లో నగదు రహిత చికిత్సకు చర్యలు

హరిపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) ద్వారా 70ఏళ్లు పైబడిన వృద్ధులకు రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమాను అందుబాటులోకి తెచ్చింది. ఈ పథకం ద్వారా జిల్లాలో సుమారు 80వేల మంది వృద్ధులకు లబ్ధి కలుగనుంది. ఈ పథకంలో నమోదైన వారికి ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందించాలి. చికిత్స విషయంలో గానీ.. ఇతరత్రా ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెబ్‌సైట్‌లో లేదా జాతీయ ఫిర్యాదుల కేంద్రం 14555ను సంప్రదించవచ్చు.

6లో



ధర్మాన మౌనం



- బంగ్లాకే పరిమితమైన మాజీ మంత్రి
- రెండేళ్ల వరకూ ప్రత్యక్ష రాజకీయాలకు బ్రేక్

రాజకీయాల్లో ఆయన తలపండిన సీనియర్ నేత. ఎన్నో కీలక పదవులు అనుభవించారు. వైసీపీ హయాంలో అధికార దర్పం ప్రదర్శించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చెందారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఆయన మౌనం దాల్చారు. ఇప్పటికీ ప్రజల్లోకి రాలేకపోతున్నారు. పార్టీ కార్యక్రమాలకు కూడా గైర్హాజరవుతున్నారు. ఇంతకీ ఆయన రాజకీయాల్లో ఉన్నారా? స్వస్తి చెప్పారా? అని అనుచరులు... వైసీపీ కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు.

శ్రీకాకుళం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):

రాజకీయాల్లో కీలకనేతగా వ్యవహరించిన మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు.. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం మౌనం దాల్చారు. ఈయన 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో ఉంటూ.. వైసీపీపై తీవ్ర విమర్శలు చేసేవారు. కానీ ఎన్నికల నోటిఫికేషన్‌కు కొద్దిరోజుల ముందు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. 2014లో శ్రీకాకుళం అసెంబ్లీ అభ్యర్థిగా వైసీపీ తరపున పోటీ చేసి.. ఓటమి చెందారు. 2019లో మళ్లీ అదేస్థానం నుంచి పోటీ చేసి.. స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. రెండున్నరేళ్ల తర్వాత మంత్రి పదవిని వైసీపీ అధినేత జగన్ కట్టబెట్టారు. మళ్లీ మొన్న(2024) ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గం నుంచే పోటీచేసిన ధర్మాన... అత్యంత దారుణమైన ఓటమిని చవిచూశారు. సర్పంచ్‌గా ఉంటూ.. ఎమ్మెల్యేగా తొలిదఫా పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ చేతిలో ఓటమి చెందారు. అప్పటి నుంచీ ధర్మాన ఏ ఒక్క కార్యక్రమంలోనూ పాలుపంచుకోవట్లేదు. కనీసం రాజకీయ కార్యక్రమాలు నిర్వహించడంలేదు. దీంతో పార్టీ శ్రేణుల్లో సైతం ధర్మాన రాజకీయాల్లో కొనసాగుతారో.. లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

● రెండేళ్ల వరకూ బ్రేక్.. అంట...

జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడగా.. 5న ప్రజాతీర్పును గౌరవిస్తున్నానంటూ ధర్మాన ప్రసాదరావు ఓ ప్రకటన విడుదల చేశారు. నెలన్నర తర్వాత వైసీపీ అధ్యక్షుడు జగన్మోహనరెడ్డిని స్వయంగా కలిశారు. అప్పటి నుంచి ధర్మాన.. రాజకీయ, జనజీవన స్రవంతిలో లేరు. తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలు, నాయకులతో కూడా పెద్దగా మాట్లాడడం లేదు. రెండేళ్ల వరకు రాజకీయాలకు బ్రేక్ ఇస్తున్నట్లు వారి వద్ద ధర్మాన వెల్లడించినట్లు సమాచారం. ఆయన ప్రస్తుతం శ్రీకాకుళం మండలం పెద్దపాడు వద్ద బంగ్లాకే పరిమితమైపోయారు. మొన్నటి ఎన్నికల్లో నియోజకవర్గంలో ఊరూవాడా చురుగ్గా పర్యటించి.. ప్రచారం చేపట్టారు. టీడీపీ ఈ ఎన్నికల్లో అభ్యర్థిని మార్పుచేయడంతో తనకే అన్నిరకాల కలసి వస్తుందని.. గెలుపు కచ్చితమని ప్రచార సభల్లో చెప్పుకొచ్చారు. కానీ ప్రజాతీర్పు ధర్మానకు వ్యతిరేకంగా వచ్చింది. 55వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇప్పటికీ ఆ ఓటమిని తట్టుకోలేక ఇంటికే పరిమితమయ్యారని భోగట్టా. అయితే కొన్ని అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని.. ప్రస్తుతం రెండేళ్ల వరకు విశ్రాంతి తీసుకోనున్నట్టు అనుచరులకు ధర్మాన చెప్పినట్టు తెలిసింది.

● పదవుల ప్రమాణ స్వీకారానికి గైర్హాజరు..

నెలరోజుల కిందట మాజీస్పీకర్ తమ్మినేనికి, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌కు వైసీపీ అధినేత జగన్.. పార్టీ పదవులను కట్టబెట్టారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని.. జిల్లా వైసీపీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ నరసన్నపేటలో అట్టహాసంగా చేపట్టారు. వైసీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులంతా హాజరైనా.. మాజీమంత్రి (మిగతా 6వ పేజీలో..)

డీఎస్సీ నోటిఫికేషన్ వాయిదా

- అభ్యర్థుల్లో నిరాశ



గుజరాతీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నోటిఫికేషన్ జాప్యంపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం డీఎస్సీ పోస్టుల భర్తీ విషయాన్ని విస్మరించింది. ఆ ఐదేళ్లూ అభ్యర్థులకు ఎదురుచూపే మిగిలింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మెగా డీఎస్సీ ప్రకటించింది. ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) కూడా నిర్వహించింది. దీంతో నిరుద్యోగ యువకుల్లో ఆశలు చిగురించాయి. చాలా మంది కోచింగ్ తీసుకుంటూ.. డీఎస్సీకి సన్నద్ధమయ్యారు. ఈ నెల 4న టెట్ ఫలితాలు కూడా విడుదల కావడంతో.. 6న డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని భావించారు. కాగా.. అనివార్య కారణాలతో మెగా డీఎస్సీ ప్రకటన వాయిదా పడింది. సాంకేతిక కారణాలు, అభ్యర్థుల వయసు పెంపు తదితర వాటిపై స్పష్టమైన నిర్ణయం రావాల్సి ఉన్నందున డీఎస్సీ నోటిఫికేషన్‌ను వాయిదా వేశారు. వాటిని సరిచేసి కొద్దిరోజుల్లో నోటిఫికేషన్ వెలువరించనున్నట్టు అధికారులు బుధవారం ప్రకటించారు. దీంతో మళ్లీ తమకు ఎదురుచూపులు తప్పడం లేదని అభ్యర్థులు నిరాశ చెందుతున్నారు.

● మెగా డీఎస్సీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 16వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సన్నాహాలు చేసింది. అందులో భాగంగా జిల్లాలో 458 పోస్టులు భర్తీ చేయనున్నట్టు భోగట్టా. స్కూల్ అసిస్టెంట్‌కు సంబంధించి ఇంగ్లీషు - 65 ఖాళీలు, గణితం- 33, సోషల్ స్టడీస్ - 71, ఫిజిక్స్- 14, తెలుగు- 37, హిందీ- 12 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. పీఈటీలు 81 ఖాళీలతోపాటు ఎస్జీటీలు సుమారు 144 పోస్టులు ఖాళీ ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఐదారు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని.. ఈ పోస్టులు భర్తీ చేయనున్నట్టు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

సైబర్ నేరాలపై అప్రమత్తం

- గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి
- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ

సోంపేట/మందస, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ స్పష్టం చేశారు. గురువారం బారువ మెరైన్ స్టేషన్, సోంపేట, మందస పోలీసుస్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న ఐటీ, సైబర్ క్రైమ్ కేసులు పరిష్కరించాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో డీఐజీ మాట్లాడారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి. అధిక సంపాదన ఆశ చూపి.. ఉద్యోగాలు కల్పిస్తామని.. మీ బంధువులు ఇబ్బందుల్లో ఉన్నారని.. ఇలా వివిధ రకాలుగా ఫోన్లు చేసి.. సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. సీబీఐ, సీఐడీ, ఎన్ఐఏ వంటి ప్రభుత్వ సంస్థల పేర్లతో బ్లాక్‌మెయిల్ చేస్తున్న సంఘటనలు కూడా మా దృష్టికి వచ్చాయి. అపరిచిత వ్యక్తులకు.. వ్యక్తిగత సమాచారం ఇవ్వరాదు. ఓటీపీలు ఎప్పుడు ఎవరికీ చెప్పరాదు. సైబర్ నేరాలకు సంబంధించి స్థానిక పోలీసులకు లేదా.. 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం అందించాలి. సైబర్ నేరాల నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'సంకల్పం' పేరుతో సదస్సు నిర్వహిస్తున్నామ'ని డీఐజీ వెల్లడించారు. 'గంజాయి నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించాం. ఒడిశా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పెట్టాం. గంజాయి బారిన పడకుండా యువతకు అవగాహన కల్పిస్తున్నామ'ని డీఐజీ తెలిపారు. అలాగే సామాజిక మాధ్యమాల్లో ఇతరుల మనోభావాలు దెబ్బతినేలా పోస్టులు పెట్టరాదని స్పష్టం చేశారు. మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేంద్ర రెడ్డి, ఏఎస్పీ పి.శ్రీనివాస్, సీఐలు బి.మంగరాజు, తిరుపతిరావు, మెరైన్ సీఐ డీవీజే రమేష్, ఎస్ఐ ఖాదర్‌భాషా పాల్గొన్నారు.



సోంపేట : మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జట్టీ, పక్కన ఎస్పీ



సబ్ స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశోక్, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కొర్లాం సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

- సీఎం చేతుల మీదుగా వర్చువల్‌గా..
- నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

ఇచ్ఛాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం 132033 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వర్చువల్ విధానంలో అమరావతి నుంచి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ మేరకు ఇచ్ఛాపురం 132033 కేవీ ఉపకేంద్రం వేదికగా ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రారంభించారు. రాష్ట్రంలో ఐదు విద్యుత్ ఉప కేంద్రాలను ముఖ్యమంత్రి ఒకే రోజున ప్రారంభించి.. మరో 13 కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యేతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి మాట్లాడారు. 'కొత్త సబ్‌స్టేషన్ పూర్తయితే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో 170 గ్రామాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయవచ్చు. ఉపకేంద్రాల ఏర్పాటుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది' అని తెలిపారు.

● అనంతరం ఎమ్మెల్యే అశోక్ విలేకరులతో మాట్లాడుతూ.. 'నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేసేందుకు రూ.54కోట్లతో కొర్లాంలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి సీఎం శ్రీకారం చుట్టారు. గృహ, వ్యవసాయ రంగంలో ఇబ్బందుల దృష్ట్యా దీనిని ఏర్పాటు చేశాం. ఏడాదిలోపే నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపడతామ'ని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, విద్యుత్‌శాఖ ఎస్ఈలు వేణునాథ్‌బాబు, కృష్ణమూర్తి, వెంకటరమణ, ఈఈ ప్రేమ్‌చంద్, డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ నాగేశ్వరరావు, ఏఈ సుగ్గు హరీష్ , టీడీపీ నాయకులు కాళ్ల ధర్మారావు, నందకి జాని, పద్మనాభం, ఢిల్లీరావు, కె.ధర్మరాజు, ఆర్.జానకిరావు, కాళ్ల జయదేవ్, జన్నెల సంతోష్, శేఖర్ పాల్గొన్నారు.

ప్రతిపాదనల్లోనే.. డీ టూరింగ్ కాలువ

- 17 ఏళ్లుగా తప్పని ఎదురుచూపులు

టెక్కలి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాలకు సాగునీటి సమస్య పరిష్కారమే లక్ష్యంగా.. నిర్మించతలపెట్టిన డీ టూరింగ్ కాలువ ప్రతిపాదనలకే పరిమితమవుతోంది. వంశధార ప్రధాన ఎడమకాలువ.. మదనగోపాలసాగరం పై అంచు నుంచి నేరుగా 1.60 కిలోమీటర్లు కాలువ తవ్వి శివారు ప్రాంతాలకు సాగునీరు ఇవ్వాలని అధికారులు భావించారు. ఈ మేరకు 2007లో అప్పటి నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఐఎస్ఎన్ రాజు డీ టూరింగ్ కాలువకు ప్రతిపాదనలు చేశారు. కాగా.. 17ఏళ్లుగా ఈ ప్రతిపాదన.. కార్యరూపం దాల్చడం లేదు. శివారు ప్రాంతాలైన నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల రైతులకు సాగునీటి సమస్య తప్పడం లేదు. గత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు పలాసలో కిడ్నీ ఆస్పత్రిని ప్రారంభించారు. ఆ సమయంలో డీ టూరింగ్ ప్రాజెక్ట్‌కు త్వరలో జీవో విడుదల చేస్తానని, తద్వారా శివారు ప్రాంతాలకు సాగునీరు అందుతుందని చెప్పి.. ఆ తరువాత దీని ఊసే వదిలేశారు. వంశధార ప్రధాన ఎడమ కాలువ నుంచి వచ్చే సాగునీరు 0.2టీఎంసీ కెపాసిటీ గల మదనగోపాలసాగరం జలాశయం నిండడానికి కనీసం వారం రోజులు పడుతుంది. ఫలితంగా శివారు ప్రాంతానికి సాగునీరు వెళ్లాలంటే జాప్యం ఏర్పడుతుంది. అందుకే రూ.8.50కోట్ల అంచనాతో డీటూరింగ్ ప్రాజెక్ట్ సిద్ధం చేయాలని ప్రతిపాదనలు చేసినా అవి గాలిలో కలిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై వంశధార ఈఈ బి.శేఖరరావు వద్ద ప్రస్తావించగా చాలాకాలంగా డీ టూరింగ్ కాలువ ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు.



డీటూరింగ్ కాలువ నమూనా గూగుల్ మ్యాప్



రేషన్ సరుకుల పంపిణీ (ఫైల్)

పాత విధానంలో రేషన్

- దుకాణాల హేతుబద్ధీకరణకు శ్రీకారం
- పెరగనున్న షాపులు

నరసన్నపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. టీడీపీ హయాంలో అమలు చేసిన మాదిరి రేషన్‌డిపోల్లో డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రేషన్‌షాపులు హేతుబద్ధీకరణ (రేషలైజేషన్) చేయాలని అధికారులను ఇటీవల ఆదేశించింది. ఈ మేరకు రేషన్ షాపుల హేతుబద్ధీకరణకు పౌరసరఫరాలశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. కొన్ని షాపులకు తక్కువ, మరికొన్ని దుకాణాలకు ఎక్కువ కార్డులు ఉన్నట్టు గుర్తించారు. అలాగే రేషన్ సరుకుల కోసం కొంతమంది రెండు.. మూడు కిలోమీటర్ల మేర రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు కిలోమీటరులోపు రేషన్ దుకాణం ఏర్పాటు చేయనున్నారు. దుకాణాలకు సమానంగా రేషన్ కార్డులు కేటాయించనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత డీలర్ల ఖాళీలను భర్తీ చేస్తారు.

ఇదీ పరిస్థితి

జిల్లాలో 1,603 రేషన్ షాపుల పరిధిలో 6,71,803 కార్డులు ఉన్నాయి. శ్రీకాకుళం పట్టణం, రూరల్‌లో 83 దుకాణాలు ఉన్నాయి. మండలాల్లో రేషన్ షాపులకు ఎన్ని కార్డులు ఉన్నాయి? లబ్ధిదారులు ఏ ప్రాంతానికి చెందినవారు.. తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఒక్కో రేషన్ దుకాణానికి గ్రామీణ ప్రాంతాల్లో 400 నుంచి 450 కార్డులు, పట్టణాల్లో 500 నుంచి 550 కార్డులు, కార్పొరేషన్ ప్రాంతాల్లో 600 నుంచి 650 కార్డులు చొప్పున సర్దుబాటు చేస్తారు. ఏదైనా గ్రామంలో 600 వరకు రేషన్ కార్డులు ఉంటే.. ఆగ్రామంలో రెండో దుకాణాన్ని ఏర్పాటు చేస్తారు. ఆ రెండు షాపులకు సమానంగా రేషన్ కార్డులను సర్దుబాటు చేయనున్నారు.

● శ్రీకాకుళం నగరంలో 800 కార్డులు దాటి సుమారు 23 దుకాణాలు ఉన్నట్టు పౌరసరఫరాల శాఖ అధికారులు గుర్తించారు. ఇదే మాదిరి ఆమదాలవలస మునిసిపాలిటీలో 12, పలాసలో 8, ఇచ్ఛాపురంలో ఆరు దుకాణాలు ఉన్నాయి. మేజర్ పంచాయతీలైన నరసన్నపేట, టెక్కలి, సోంపేట తదితర పట్టణాల్లో 800 కార్డులకుపైగా ఉన్న దుకాణాలు సుమారు మరో 20 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఇక కొన్ని పంచాయతీల్లో ఆరేడు గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు చెందినవారు కొందరు రేషన్ కోసం మూడు కిలోమీటర్ల వరకు రావాల్సి ఉంటుంది. వీటిని దృష్టిలో పెట్టుకొని ఎక్కువ కార్డులు ఉన్నచోట మరొక దుకాణం ఏర్పాటు చేసి.. కార్డులు సర్దుబాటు చేస్తారు.

● అలాగే కొత్తకార్డుల కోసం జిల్లాలో 12వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలో ప్రభుత్వం అర్హులందరికీ కొత్తకార్డులు మంజూరు చేసే అవకాశం ఉంది. వీటిని కూడా దృష్టిలో పెట్టుకుని రేషన్‌లైజేషన్ చేయనున్నారు. తర్వాత డీలర్ల పోస్టులు భర్తీ చేసి.. గతంలో మాదిరి దుకాణాల వద్దే లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందజేసే అవకాశం ఉంది.

నేడు మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు

గుజరాతీపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మున్సిపల్ ఉపాధ్యాయులకు శుక్రవారం పదోన్నతులు చేపట్టనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. ఆమదాలవలస, ఇచ్ఛాపురం మునిసిపాలిటీలతోపాటు శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న పాఠశాల సహాయకులు, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టుల పదోన్నతి కోసం అర్హుల జాబితాను డీఈవో వెబ్‌సైట్‌లో పొందపర్చామన్నారు. జాబితాలోని అభ్యర్థులు శుక్రవారం శ్రీకాకుళంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలనకు, కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. ఆమదాలవలస, ఇచ్ఛాపురం మునిసిపాలిటీల్లో బయోలాజికల్ సైన్స్, ఇంగ్లీషు, ఉర్దూ ఒక్కో పోస్టు ఖాళీ ఉంది. తెలుగు - నాలుగు ఖాళీలు ఉన్నాయి. పీఎస్ఎంఎం పాఠశాలలో రెండు, శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో తొమ్మిది ఖాళీలు ఉన్నాయి' అని డీఈవో తెలిపారు.

● రేపు గోపాష్టమి ● కోష్ట గోశాలలో ప్రత్యేక ఏర్పాట్లు
● 500 దేశీయ గోవులకు పూజలు
● దేశం నలుమూలల నుంచి రానున్న రుత్వికులు

బృందావనమది.. అందులేదీ!


కోష్టలోని గోశాల వద్ద ఆలయం

రణస్థలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):

ఏడాదిలో కార్తీక మాసానిది ప్రత్యేక స్థానం. ఈ నెలలో ప్రతి రోజూ ప్రత్యేకమే. కార్తీక మాసంలో ఎనిమిదో రోజున గోపాష్టమిని నిర్వహిస్తారు. ఆ రోజును శ్రీకృష్ణుడికి అత్యంత ప్రీతికరమైనదిగా భావిస్తారు. ఆ రోజునే తొలిసారి శ్రీకృష్ణుడు పశువులను మేతకు తీసుకు వెళ్లాడని పురాణాలు చెబుతాయి. అందుకే గోపాష్టమిని వేడుకగా నిర్వహిస్తారు. జిల్లాలో ఎన్నో గోశాలలు ఉన్నాయి. కానీ రణస్థలం మండలం కోష్టలోని రామకృష్ణ మహా మందిరంలో నిర్వహిస్తున్న గోశాల మాత్రం ప్రత్యేకమైనది. దశాబ్ద కాలంగా అక్కడ గోశాలను నిర్వహిస్తున్నారు. త్రిదండి శ్రీభక్త వైభవ పూరిగోస్వామి మహరాజ్, త్రిదండి కేశవ మహరాజ్ స్వామిజీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గోశాల జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించింది. ఇక్కడ నిత్య గోపూజ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా గోపాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం గోపాష్టమి వేడుకలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దేశం నలుమూలల నుంచి రుత్వికులు హాజరవుతున్నారు. ఉదయం 8 గంటలకు సుదర్శన యజ్ఞం, 9 గంటలకు గోపూజ, 10 గంటలకు గో పరిక్రమ, 11 గంటలకు గోదానం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రథయాత్ర వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

● ప్రత్యేక పర్వదినం..

గోపాష్టమి కార్తీక మాసం శుక్లపక్షంలో ఎనిమిదో రోజున వస్తుంది. ఆ రోజున గోవులకు విశేషంగా పూజలు చేస్తారు. హిందూ సంస్కృతిలో ఆవులను దేవతలే స్వయంగా పూజించినట్టు పురాణాలు చెబుతాయి. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించిన ఫలితం సిద్ధిస్తుందని చెబుతారు. అటువంటి గోవులను పూజించే రోజును గోపాష్టమిగా భావిస్తారు. ఆ రోజును పవిత్రంగా పరిగణిస్తారు. శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని చిటికెన వేలిపై ఎత్తే రోజుగా చెబుతారు. అదే రోజు గోపాలకుడైన శ్రీకృష్ణునితో పాటు గోవులను కూడా పూజిస్తారు. అదే రోజు తిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధిలో పుష్పయాగ మహోత్సవాన్ని అత్యంత వేడుకగా నిర్వహిస్తారు.

● మేలు జాతి ఆవులు..

ఈ గోశాలలో అడుగు పెడితే బృందావనంలో అడుగు పెట్టినట్టుగా అనిపిస్తుందని భక్తులు చెబుతున్నారు. దేశంలోని మేలుజాతి ఆవులు అక్కడ దర్శనమిస్తాయి. దాదాపు 500కుపైగా దేశీయ ఆవులను అక్కడ సంరక్షిస్తున్నారు. ప్రతి ఆవుకు గుర్తింపు ఉంటుంది. చెవికి మార్కు ఉంటుంది. వివిధ రాష్ట్రాలకు చెందిన మేలు జాతి ఆవులు అక్కడ కనిపిస్తాయి. వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన ఆవులను సంరక్షించి..నిత్యపూజ చేయడమే పని అని మందిరం నిర్వాహకులు చెబుతున్నారు.


గో సేవ చేస్తున్న భక్తుడు

పరమ పవిత్రం..

ఆ రోజు పరమ పవిత్రమైనది. స్వయంగా శ్రీకృష్ణుడు గోవును పూజించిన రోజు ఇది. గోశాలను సందర్శించి పూజలు చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది. అందుకే జిల్లాలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గోశాలను ఏర్పాటు చేశాం. ఇక్కడ పూర్తి స్థాయి దేశీయ గోవులే ఉంటాయి. దేశీయ ఆవును దానం చేయవచ్చు. గోశాల నిర్వహణకు విరాళాలు ఇవ్వచ్చు. గోపాష్టమి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. దేశం నలుమూలల నుంచి రుత్వికులు వస్తున్నారు. భక్తులు కూడా అధిక సంఖ్యలో తరలిరావాలి.

-త్రిదండి కేశవమహరాజ్ స్వామిజీ, గోశాల వ్యవస్థాపకులు


గోశాలలోని దేశీయ ఆవులు


హోంమంత్రి నుంచి ట్రోఫీ అందుకుంటున్న ప్రదీప్తి

ఇద్దరూ ఇద్దరే!

● అక్క పోలీసు విభాగంలో.. చెల్లెలు రక్షణ దళంలో..
● లక్ష్య సాధనలో విజయం సాధించిన ప్రదీప్తి, ప్రతిభ
● తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులే..
● స్ఫూర్తిగా నిలుస్తున్న కొర్లకోట వాసులు

ఆమదాలవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులుగా ఆ దంపతులు ఎందరి జీవితాలనో తీర్చిదిద్దారు. అదే క్రమంలో తమ బిడ్డలను ధైర్య సాహసాలకు ప్రతీకగా నిలిపి... రక్షణ రంగంలోకి పంపించారు. ఆ బిడ్డలూ అంతే పట్టుదలతో తల్లిదండ్రుల లక్ష్య సాధన కోసం తపించి... అనుకున్నది సాధించారు. ఆ దంపతులు కొర్లకోట గ్రామానికి చెందిన పేడాడ అప్పారావు, సుగుణవేణి. ఆ బిడ్డలు ప్రదీప్తి, ప్రతిభ. చెల్లి ప్రతిభ ఆర్మీలో మేజర్‌గా విధులు నిర్వహిస్తుండగా... అక్క ప్రదీప్తి డీఎస్పీగా ఎంపికై...శిక్షణ పూర్తి చేసుకున్నారు. అప్పారావు మాస్టారు పదవీ విరమణ చేయగా... సుగుణవేణి ప్రస్తుతం ఆమదాలవలస మండలం ముద్దాడపేటలో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు.

చెల్లెలిని ఆదర్శంగా తీసుకొని...

ఆర్మీలో ఉద్యోగం సాధించిన తన చెల్లెలు ప్రతిభను ఆదర్శంగా తీసుకొని... తాను కూడా ఎలాగైనా యూనిఫారం వేసుకోవాలనే లక్ష్యంతో ప్రయత్నం చేశానని ప్రదీప్తి తెలిపారు. తన చెల్లెలు ప్రతిభ హౌరాలో మేజర్‌గా పనిచేస్తోందని చెప్పారు. తాను బీటెక్ పూర్తి చేసి... రెండేళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేశానని చెప్పారు. ఆ తరువాత పంచాయతీ కార్యదర్శిగా, ఎక్సైజ్ ఎస్ఐగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనప్పటికీ తన చెల్లి ప్రతిభ ప్రోత్సాహంతో సివిల్స్‌కు ప్రిపేరయ్యానని తెలిపారు. ఈ క్రమంలోనే డీఎస్పీగా ఎంపికయ్యానని చెప్పారు. తమ అక్కచెల్లెళ్ల అభీష్టం మేరకు తల్లిదండ్రులు పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించడంతో అనుకున్న లక్ష్యం సాధించామని వివరించారు.

ఆడపిల్లలు నిరాశ చెందవద్దు..

ఆడపిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు సమాజంలో చిన్నచూపు చూస్తుంటారు. అలాంటి సమయంలో ఆడపిల్లలు నిరాశ చెందకుండా ముందుకు సాగాలి. మా తల్లి దండ్రులు అటువంటి భావన లేకుండా మాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఆత్మ విశ్వాసంతో చదివి డీఎస్పీగా ఎంపికయ్యాను. బెస్ట్ ఇండోర్ మెడల్‌తో పాటు రాష్ట్ర హోం మంత్రి నుంచి ట్రోఫీని అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఎంచుకున్న రంగంలో కష్టపడితే విజయం సాధ్యమవుతుంది.

-పేడాడ ప్రదీప్తి

ఎంతో సంతోషం..

మా ఇద్దరు కుమార్తెలు ఇంతటి ఘనత సాధించడం ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. తల్లిదండ్రులు ఎవరైనా ఆడపిల్లలను తక్కువగా చూడకుండా... వారి అభీష్టం మేరకు చదువు.. ఇతర విషయాల్లో ప్రోత్సహించాలి.

-అప్పారావు, సుగుణవేణి

వృద్ధులూ.. ఆయుష్మాన్ భవ!

● 70 ఏళ్లు పైబడిన వారికి ఆరోగ్య బీమా



హరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల ఆరోగ్య పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్‌భవ' పథకాన్ని అమలులోకి తెచ్చింది. 70ఏళ్ల పైబడిన వృద్ధులకు రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమాను ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీ ఎంజేఏవై) ద్వారా అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో సుమారు 80వేలకు పైగా ఉన్న 70ఏళ్ల పైబడిన వృద్ధులకు ఆయుష్మాన్ భవ పథకంతో లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌టీఆర్ ఆరోగ్య శ్రీ ద్వారా అన్ని వయసుల వారికీ వైద్య సేవలను అందిస్తోంది. 1500కు పైగా వ్యాధులకు చికిత్స అందజేస్తున్నారు. దీనితో పాటు కేంద్రం ప్రత్యేకంగా వృద్ధులకు ఆయుష్మాన్ భవ పథకాన్ని అందజేస్తోంది. ఈ పథకం కింద జిల్లాలో 6 కార్పొరేట్ ఆసుపత్రులు సేవలు అందిస్తున్నాయి.


దరఖాస్తు ఇలా...

ఏబీపీఎంజేఏవై పథకంలో లబ్ధి పొందేందుకు ముందుగా పీఎంజేఏవై ఆయుష్మాన్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలి. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఈఎన్ఈఎఫ్ఐసీఐఏఆర్‌వై.ఎన్‌హెచ్ఏ.జీవోవి.ఐఎన్ వెబ్ సైట్‌లో ఆయుష్మాన్ భారత్ ఎలిజిబుల్ ట్యాబ్‌పై క్లిక్ చేసి ఓటీపీ నమోదు చేయాలి. కేవైసీ కోసం పూర్తి వివరాలు నమోదు చేసి ఆమోదం కోసం వేచి ఉండాలి. ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తరువాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయొచ్చు. ఈ పథకంలో నమోదైన వారికి ఆసుపత్రులు నగదు రహిత చికిత్స అందించాలి. చికిత్స విషయంలో గానీ.. ఇతరత్రా ఏమైనా ఫిర్యాదులు ఉంటే వెబ్‌సైట్‌లో లేదా జాతీయ ఫిర్యాదుల కేంద్రం 14555ను సంప్రదించవచ్చు.

ప్రయోజనాలివీ..

ఇప్పటికే ఈ పథకం కింద లబ్ధిదారులుగా (ఆరోగ్యశ్రీతో కలిపి 6.62 లక్షల కార్డులు) ఉన్న కుటుంబాల్లోని వృద్ధులకు అదనంగా మరో రూ.5లక్షల బీమా వర్తిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్లు పైబడిన వారు ఇద్దరు ఉంటే చెరో రూ.2.50లక్షల వైద్య సాయం పొందవచ్చు. ఇతర బీమా పథకాల్లో ఉన్న వారు ఏదైనా ఎంచుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ఉచితంగా ఆసుపత్రుల్లో చేర్చుకోవటం, వైద్య పరీక్షలు, చికిత్స, ఇంటెన్సివ్ కేర్, మందులు, వసతి, పోషకాహారం వంటి సేవలు పథకంలో లభిస్తాయి.

వివరాలిలా..



సేవలందించే ఆసుపత్రులు.. 6

ఎంతో ఉపయోగకరం..

ఈ పథకం వృద్ధులకు జీవిత చరమాంకంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వయో వృద్ధులకు సాంత్వన కలిగిస్తుంది. బీమాతో పాటు ఆరోగ్య రక్షణ కల్పించడం వల్ల పిల్లలు సాయం అందిస్తారు. ఈ పథకం వంద శాతం అమలుకు వీలుగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-జి.లక్ష్మీనారాయణ, విశ్రాంత ఎంఈవో, మందస

ధర్మాన మౌనం

(ఐదో పేజీ తరువాయి)

ధర్మాన ప్రసాదరావు మాత్రం ఈ కార్యక్రమానికి వెళ్లలేదు. ఎన్నికల ఫలితాలొచ్చి ఐదు నెలలు అయింది. కానీ పార్టీపరంగా ఆయన ఒక ప్రకటన కూడా ఇవ్వలేకపోయారు. దీంతో ఆయన వెంటున్న కార్యకర్తలు ఒక్కొక్కరు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికలను వెతుక్కుంటున్నారు. అన్నీ కలిసి వస్తే మొన్న ఎన్నికల్లోనే తన వారసుడైన రామ్‌మనోహర్ నాయుడును అసెంబ్లీ బరిలో దింపాలని భావించారు. కానీ జగన్ ససేమిరా అనేశారు. ఇష్టం లేకున్నా.. కొన్ని సమీకరణాలు తనకు కలసి వచ్చేస్తాయన్న ధీమాతో ధర్మాన ఎన్నికల్లో పోటీ చేశారు. చివరకు ఓడిపోయారు. అయితే కుమారుడు రామ్‌మనోహర్‌నాయుడు.. ఎన్నికల వరకు తండ్రితో ప్రతికార్యక్రమంలో పాల్గొని.. ఫలితాలు వచ్చాక.. విశాఖపట్నానికి మకాం మార్చేశారు. ఆయన కూడా పార్టీ కార్యక్రమాలకు గైర్హాజరే. దీంతో తండ్రీ కుమారులిద్దరూ వైసీపీకి దూరంగా ఉంటూ.. ప్రత్యామ్నాయం వైపు అడుగులేస్తున్నారా? లేదా.. పరిస్థితిని గమనించి అప్పుడు చూద్దాంలే అన్న భావనతో ఉన్నారా? అన్నది అనుచరులకే అర్థం కావట్లేదు. జిల్లాలో తుడిచి పెట్టుకుపోయిన వైసీపీకి ప్రత్యేకంగా శ్రీకాకుళంలో పెద్దదిక్కు కరువైంది. ధర్మాన మౌనం దాల్చడంతో.. వైసీపీ సానుభూతిపరులు సైతం.. టీడీపీ, జనసేనలో చేరిపోతున్నారు. ఫలితంగా శ్రీకాకుళం వైసీపీ పరిస్థితి మరింత ఘోరంగా మారిపోయింది.

హోరాహోరీగా..

● ఉత్కంఠగా ఆంధ్ర-ఉత్తరాఖండ్ రంజీ మ్యాచ్
● తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ స్కోర్ 338

విజయనగరం టౌన్, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఉత్తరాఖండ్ టీంల మధ్య రంజీమ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఉత్తరాఖండ్ 338 పరుగులు సాధించింది. విజయనగరం సమీప చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ క్రికెట్ మైదానంలో బీసీసీఐ ఆధ్వర్యంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఆతిథ్యంలో ఆంధ్రా- ఉత్తరాఖండ్ జట్ల మధ్య బుధవారం మ్యాచ్ ప్రారంభమైంది. రెండో రోజు గురువారం కూడా పోరు హోరాహోరీగా సాగుతోంది. తొలి రోజు వికెట్ నష్టానికి 232 పరుగులతో ఆట ముగించిన ఉత్తరాఖండ్, రెండో రోజు భారీ స్కోర్ ఖాయమనుకున్న దశలో ఆంధ్రా జట్టు బౌలర్లు అద్భుతంగా రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో 135.2 ఓవర్లలో 338 పరుగులకే పరిమితమైంది. కెప్టెన్ సమర్థ్ (59) అర్ధ సెంచరీ సాధించాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు ఎవరూ రాణించకపోవడంతో 338 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్రా బౌలర్లలో లలిత్‌మోహన్ 4 వికెట్లు సాధించగా కేవీ శశికాంత్, సత్యనారాయణరాజు, విజయ్‌లు రెండేసి వికెట్లు సాధించారు.


ఆంధ్ర-ఉత్తరాఖండ్ జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం

92 పరుగులకు 4 వికెట్లు..

ఉత్తరాఖండ్ భారీ స్కోర్ చేయకుండా నిలువరించిన ఆంధ్రా జట్టు బ్యాటింగ్‌లో తడబడింది. గురువారం మధ్యాహ్నం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు ఆట ముగిసే సమయానికి 35.5 ఓవర్లలో 4 కీలక వికెట్లు నష్టపోయి 92 పరుగులు చేసింది. ఓపెనింగ్ బ్యాటర్లు అభిషేక్‌రెడ్డి (35), హేమంత్‌రెడ్డి (18)లు తొలి వికెట్‌కు (54) అర్ధ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి శుభారంభం అందించినా 15 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆంధ్రా జట్టు కెప్టెన్ ఎస్‌కె రషీద్ (0) డకౌట్‌తో వెనుతిరగ్గా కరణ్ షిండే 19 పరుగులు చేసి ఆఖరిలో అవుటయ్యాడు. సీనియర్ బ్యాటర్ హనుమవిహారి 15 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. మూడో రోజు జట్టు భారమంతా సీనియర్ బ్యాటర్లు హనుమవిహారి, వికెట్ కీపర్ కెఎస్ భరత్‌పైనే ఉంది.

రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ విజేత శ్రీకాకుళం

బాలురు, బాలికల విభాగాల్లో..


బాలురు, బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన శ్రీకాకుళం క్రీడాకారులతో టీడీపీ నేత జయచంద్రారెడ్డి

ములకలచెరువు/శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ విజేతలుగా శ్రీకాకుళం జట్లు నిలిచాయి. బాలురు, బాలికల రెండు విభాగాల్లోనూ శ్రీకాకుళం జిల్లా జట్లు గెలుపొందాయి. కడప జిల్లా ములకలచెరువులో 68వ రాష్ట్ర స్థాయి అండర్-14 విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలు, బుధ, గురువారాలు జరిగాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. బాలురు, బాలికల విభాగాలకు సంబంధించి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడా సంబరం గురువారం సాయంత్రం ముగిసింది. పోటీలకు తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి సహాయ, సహకారాలు అందించారు. రూ.3 లక్షలు నగదు ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. బాలురు, బాలికల విభాగంలో విజేతలుగా నిలిచిన శ్రీకాకుళం జట్లకు, రన్నర్స్‌గా నిలిచిన చిత్తూరు, విశాఖపట్నం జట్లకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వసంత తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన పోటీలు..

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. గురువారం జరిగిన బాలుర విభాగం క్వార్టర్ ఫైనల్స్‌లో విశాఖపట్నం, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జట్లు గెలిచి సెమీస్‌కు చేరాయి. బాలికల విభాగంలో శ్రీకాకుళం, క్రిష్ణా, విశాఖపట్నం, నెల్లూరు జట్లు గెలిచి సెమీస్‌కు చేరాయి. బాలుర విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది. మరో సెమీఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో చిత్తూరు జట్టు గెలిచి ఫైనల్‌కు చేరింది. అనంతరం శ్రీకాకుళం, చిత్తూరు జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో జరిగిన ఫైనల్స్‌లో మొదటి మ్యాచ్ చిత్తూరు, రెండో మ్యాచ్ శ్రీకాకుళం గెలుపొందాయి. మూడో మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు ఐదు పాయింట్ల ఆధిక్యంతో గెలుపొంది విజేతగా నిలిచింది. బాలికల విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, క్రిష్ణా జట్లు తలపడగా శ్రీకాకుళం జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో విశాఖపట్నం, నెల్లూరు జట్ల మధ్య జరగ్గా విశాఖపట్నం గెలిచి ఫైనల్ చేరింది. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో శ్రీకాకుళం, విశాఖపట్నం జట్లు తలపడ్డాయి. మొదటి, రెండు మ్యాచ్‌లో శ్రీకాకుళం జట్టు విశాఖపట్నం జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది.

బి.కంచరాం సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

పొందూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బురిడి కంచరాం సర్పంచ్ గంట్యాడ లక్ష్మి చెక్ పవర్‌ను రద్దుచేస్తూ డీపీవో ఆదేశాలు జారీచేశారని ఎంపీడీవో మీసాల మన్మథరావు తెలిపారు. పంచాయతీకి చెందిన 14, 15 ఆర్థిక సంఘం నిధులను దుర్వినియోగంచేసినట్లు, పనులుచేయకుండానే నిధులు డ్రాచేసినట్లు గ్రామానికి చెందిన వండాన మురళి కలెక్టరు, డీపీవోకు ఫిర్యాదుచేశారు.ఈ మేరకు విచారణలో నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారణ కావడంతో సర్పంచ్ చెక్‌పవర్‌ను డీపీవో రద్దు చేశారని ఎంపీడీవో పేర్కొన్నారు.

కొటేరు బందలో ఆక్రమణలను తొలగించండి: కలెక్టర్

ఇచ్ఛాపురం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కొటేరు బందలో తక్షణమే సర్వే జరిపించి ఆక్రమణలను తొలగించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు.ఇచ్ఛాపురం మునిసిపాలిటీ పరిధిలో గల బెల్లుపడ జామిఎల్లమ్మ ఆలయం సమీపంలోని కొటేరు బందలో ఆక్రమణలను తొలగించాలని ఆ గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో స్పందించిన కలెక్టర్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ బందను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా 35 ఎకరాల 22 సెంట్లు ఉన్న కొటేరు బంద 10.78 ఎకరాలు ఆక్రమణలుకుగురైందని అధికారుల సర్వేలో తేలింది. కార్యక్రమంలో శంకర రెడ్డి, దుర్గాసి పాపారావు, బడే దొరబాబు, తిప్పన కూర్మారావు, చాట్ల లోహిదాస్‌రెడ్డి, బింగి యాదవరావు, గిన్ని చిన్న పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం మండలంలోని 11 బాహుదా చానల్స్‌ను రూ.21 కోట్లతో మరమ్మతులు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎమ్మెల్యే అశోక్‌తోకలిసి గురువారం బెల్లుపడ, ఈదుపురం చానల్స్‌ను పరిశీలించారు. తక్షణమే గ్రోయిన్ల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

● ఆదాయ వనరులు పెంచుకొని మునిసిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాలని కలెక్టర్ కోరారు. మునిసిపల్ అధికారులతో ఎమ్మెల్యే అశోక్‌తో కలిసి సమీక్షించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కమిషనర్ ఎన్.రమేష్ పాల్గొన్నారు. కాగా ఈదుపురానికి చెందిన బలిజపల్లి జానికికి మూడు సెంట్ల పట్టాను కలెక్టర్, ఎమ్మెల్యే తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఇటీవల ఈదుపురంలో జరిగిన దీపం-2 సభలో సీఎం చంద్రబాబు గ్రామానికి చెందిన బలిజపల్లి జానికికి స్థలం మంజూరు చేయాలని ఆదేశించిన విషయం విదితమే. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరావు, డీటీ శ్రీహరి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

గుజరాతీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ సర్టిఫికెట్ కోర్సుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీ), డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలకు సంబంధించి లోయర్ గ్రేడ్‌లో పరీక్ష రాసేందుకు ఏడో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, లోయర్ పాసైన వారు హైయర్ గ్రేడ్‌కు అర్హులని తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించి ఫీజుల వివరాలు వెబ్‌సైట్‌లో పొందపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని ఈ నెల 30లోగా సమర్పించాలని కోరారు.

యోగా పోటీలకు బీఆర్ ఏయూ జట్టు ఎంపిక

ఎచ్చెర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్‌లోని కిట్ యూనివర్సిటీలో వచ్చే నెల 26 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఆల్ ఇండియా అంతర్ యూనివర్సిటీ యోగా పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ తరఫున పాల్గొనే జట్టు ఎంపిక చేశారు. ఈమేరకు వర్సిటీలో జరిగిన ఎంపికలో అనుబంధ కళాశాలల నుంచి 30 మంది హాజరుకాగా, పురుషులు, మహిళల విభాగం తరఫున ఐదుగురిని చొప్పున ఎంపికచేశారు. వర్సిటీ స్పోర్ట్స్ డీన్ డాక్టర్ పి.రవి కుమార్, ట్రిపుల్ ఐటీ యోగా విభాగాధిపతి జి.ఈశ్వరరావు, వర్సిటీ పీడీలు శ్రీనివాసరావు, ఎ.భాస్కర్ పర్యవేక్షణలో ఎంపికలు జరిగాయి.

● చండీఘడ్‌లో గత నెలలో జరిగిన జాతీయ స్థాయి (వినుస్క్వాడ్ -2024) క్రికెట్ పోటీల్లో ఆంధ్రా జట్టు తరఫున పాల్గొన్న ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి నంబాల సుశాంత్ సత్తాచాటాడు. లీగ్ పోటీల్లో చండీఘడ్ జట్టుపై సుశాంత్ 62 బాల్స్‌కు 53 పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డాడు. ఈమేరకు సుశాంత్‌ను కళాశాల డైరెక్టర్ డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌పీవీ రమణ మూర్తి నాయుడు అభినందించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

గుజరాతీపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ రోడ్‌లో పలు షాపులను తనిఖీచేశారు.

సమస్యలు పరిష్కరించాలి

రణస్థలం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని 104 సిబ్బంది కె.ఉష, కె.కూర్మారావు, మురళి, గౌరీశంకర్, రమేష్, సాయి, ఎ.సత్యవతి, శంకర్, కన్నబాబు కోరారు. ఈ మేరకు రణస్థలంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును కలిసి తమ సమస్యలు వివరించారు.

సభ్యత్వ నమోదు

ఎచ్చెర్ల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీలో సభ్యత్వంతోనే ఆత్మగౌరవంలభిస్తుందని ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి తెలిపారు. గురువారం బుడగట్లపాలెంలో సభ్యత్వనమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్నవారికి బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలోమండల తెలుగు యువతఅధ్యక్షుడు, సర్పంచ్ అల్లుపల్లి రాంబాబు, గాడు రామారావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బంగారు గొలుసు చోరీ

కవిటి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజపురంలో ఓ మహిళ మెడలో ఉన్న తులన్నర బంగారు గొలుసు గుర్తుతెలియని వ్యక్తులు తెంపుకొని అపహరించుకుపోయిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రాజపురం గ్రామానికి చెందిన సనపల సుజాత గురువారం పొలం పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తోంది. మార్గ మధ్యంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. వెనుక నుంచి వచ్చి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసు తెంచుకొని వెళ్లిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

గార, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బచ్చువానిపేటకు చెందిన బచ్చు లక్ష్మణరావు (43) ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. లక్ష్మణరావు పెయింటింగ్, వ్యవసాయ పనులు చేసి జీవిస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉన్న ఆయన కూలి డబ్బులు కూడా ఇంటికి ఇవ్వకుండా నిత్యం మద్యం సేవిస్తూ ఇంటికి వచ్చేవాడు. దీంతో భర్త లక్ష్మణరావును భార్య మద్యం తాగవద్దని అంటుండేది. అయినా ఆయన ఆ అలవాటు మానుకోలేదు. దీంతో మానసికంగా బాధపడుతున్న లక్ష్మణరావు బుధవారం ఉదయం పురుగులు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం లక్ష్మణరావు మృతిచెందాడు. భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆర్.జనార్దనరావు తెలిపారు. మృతుడికి కుమారుడు ఉన్నాడు.

33వ జాతీయ షూటింగ్ పోటీలో ప్రణవి ప్రతిభ



టెక్కలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో నేషనల్ రైఫిల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో 33వ ఆల్‌ఇండియా జీవీ మవలంకర్ షూటింగ్ చాంపియన్‌షిప్ (రైఫిల్) పోటీ ల్లో టెక్కలి మండలం తిర్లంగి గ్రామానికి చెందిన వజ్జ ప్రణవి ప్రతిభ కనబరిచింది. ఈనెల 3 నుంచి 7వ తేదీ వరకు జరిగాయి. సబ్ యూత్, యూత్, జూనియర్ ఉమెన్, ఉమన్ వ్యక్తిగత విభాగాల్లో కాంస్య పతకాలను కైవసం చేసుకుంది. మెడల్స్‌ను కేరళ రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ యూత్ ఎఫైర్స్ డైరెక్టర్ టి.విష్ణురాజు అందజేశారు. ఈమె ప్రస్తుతం బెంగుళూరులో 8వ తరగతి చదువు తోంది. ప్రణవి జాతీయ స్థాయిలో కాంస్యపతకాలు సాధించిడంపై తల్లిదండ్రులు, బంధువులు హర్షం వ్యక్తంచేశారు.

ప్రజాహక్కుల ర్యాలీ విజయవంతం చేయండి

పలాస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిసెంబరు 4న నిర్వహించనున్న ప్రజా హక్కుల ర్యాలీని విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగతా బంగార్రాజు కోరారు. గురువారం స్థానిక జీడి కార్మిక భవన్‌లో ఆ పార్టీ పలాస, టెక్కలి డివిజన్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా పాలనలో విఫలమైం దన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కిరణ్, పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్, సీనియర్ సభ్యుడు మద్దిల మల్లేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, కుత్తమ దుష్యంత్, దున్న శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

- ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం



సచివాలయ ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సరుబుజ్జిలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాల సిబ్బంది పనితీరు మార్చు కోకపోతే ఏ ఒక్కరిని క్షమించబోనని ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సరుబుజ్జిలిలో ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఎంపీడీవో పావని పలు శాఖలపై నిర్వహించిన సమీక్షలో అధికారుల తీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు సేవలం దించాల్సిన సచివాలయ వ్యవసాయశాఖ అసిస్టెంట్లు నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. జడ్పీటీసీ సభ్యుడు నాగేశ్వరరావు, టీడీపీకి చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌ల మధ్య గత ప్రభుత్వ నిర్మాణ బిల్లులపై వాగ్వాదం చోటుచేసుకుంది. తహసీల్దార్ మధుసూదన్, వైస్ ఎంపీపీ జీవీఎస్ఎన్ మూర్తి, ఎంపీటీసీ శివ్వాల సూర్యనారాయణ పాల్గొన్నారు. ● ఆమదాలవలస, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. చీమలవలసలో సీసీ రోడ్లు, కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సనపల చెల్లంనాయుడు, ఎంపీడీవో రోణంకి వెంకటరావు, నాయకులు చంద్రశేఖర్, డిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి సీపీఎం జిల్లా మహాసభలు

కోటబొమ్మాళి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పలాసలో ఈనెల 9, 10వ తేదీల్లో సీపీఎం జిల్లా మహా సభలను నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవింద రావు, జిల్లా కమిటీ సభ్యుడు షణ్ముఖరావు కోరారు. గురువారం సమావేశం నిర్వహించారు. హనుమంతు ఈశ్వరరావు పాల్గొన్నారు.

తాటిపోలమ్మతల్లి ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

నందిగాం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పెంటూరులో నూతనంగా నిర్మించిన తాటిపోలమ్మతల్లి మందిరం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు గురువారం ప్రారంభమ య్యాయి. అమ్మ వారిని పగటి వేషా లు, మేళ తాళా ల మధ్య తిరువీధి నిర్వహించారు. మహిళలు కలశాలతో పాల్గొన్నారు.

శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ, సామూహిక కుంకుమ పూజలు, అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.



క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

హరిపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై మహిళలకు అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. హరి పురం సామాజిక ఆసుపత్రి లో రైజ్ సంస్థ సీఈవో పుల్లట ప్రవీణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానం, గిరిజనం, మత్స్యకారులు, రైతులు కలగలిసిన మండలంలో ఇలాంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు మహిళలకు స్కానింగ్, స్క్రీనింగ్, పాప్ స్మియర్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సూపరింటెండెంట్ స్వరాజ్యలక్ష్మి నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు,డి.తాతారావు, బమ్మిడి కర్రయ్యయ, గున్నయ్య, పుల్లా వాసు పాల్గొన్నారు.

విద్య, వైద్యాలకు ప్రాధాన్యం

వజ్రపుకొత్తూరు, నవంబరు 6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వైద్యం, విద్యలకు ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవనానికి గురువారం భూమిపూజ చేశారు. వైద్యులు తేజస్విత, డెవిడ్ బూన్, ఆర్‌అండ్‌బీ ఏఈ జగదీష్, టీడీపీ నాయకులు వసంతస్వామి, ఉమా మహేశ్వరరావు, దువ్వాడ హేంబాబుచౌదరి, సూరాడ మోహనరావు పాల్గొన్నారు. ● ఒంకులూరులో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే శిరీష భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె.సురేఖ, నేతలు బి.శశి భూషణ్, దాసరి జేజేరావు, పి.సాంబమూర్తి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నమ్మకం కలిగేలా సేవలందించాలి

జలుమూరు (సారవకోట), నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగుల్లో నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుడితి సామాజిక ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం గురువారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రిలో గైనకాలజిస్టు ఉన్నా ఆసుపత్రి ప్రసవాలు చేపట్టకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు అక్కాజోస్యుల దత్తుబాబు, పొన్నాన రామకృష్ణ, గొల్లంగి మోహనరావులతో ప్రమాణం చేయించారు. పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ.. బుడితి సీహెచ్‌సీలో పోస్టుమార్టం సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. సమావేశంలో సూపరింటెండెంట్ సృజనకుమారి, ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ నేతలు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, పట్ట ఉమారావు పాల్గొన్నారు.

కరకవలస మాజీ సర్పంచ్ టీడీపీలో చేరిక



మాజీ సర్పంచ్‌లు గోవిందరావు, గున్నమ్మలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బగ్గు

కరకవలస మాజీ సర్పంచ్ బొంగు గోవిందరావు, భార్య గున్నమ్మ వైసీపీని వీడి గురువారం టీడీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ప్రతినిధి మెండ రాంబాబు, సర్పంచ్‌లు తమ్మన్నగారి సతీష్, గురుబెల్లి వెంకటరమణ, నాయకులు తర్ర బలరాం, దుంగ స్వామిబాబు, పొన్నాన దాలయ్య పాల్గొన్నారు.

సీవీ రామన్ భారత జాతికి ఆదర్శం

నరసన్నపేట,నవంబరు7(ఆంధ్రజ్యోతి): భారత జాతికి సీవీ రామన్ ఆదర్శప్రాయడని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.రవికుమార్ అన్నారు. గురువారం సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు సీవీరామన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ ప్రగతిలో భాగస్వామ్యం కావాలి

కొత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సమాజ ప్రగతిలో విద్యార్థుల నైపుణ్యం కీలకమని డా.బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ బీసీడీఈ సమన్వయకర్త డాక్టర్ బి.అజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి, బోర్డ్ ఆఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ ఎడ్యుకేషన్, డా.బీఆర్ఏయూ ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం శిక్షణ ఇచ్చారు. సమాజాభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణారావు, కళాశాల బీసీడీఈ కో-ఆర్డినేటర్ జి.మహేష్‌బాబు, సాంకేతిక అధ్యాపకుడు ఎస్.శ్రీనివాసరావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా సత్సంగం పోస్టర్ ఆవిష్కరణ

నరసన్నపేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 13న యోగా గురువు పండిట్ రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా సత్సంగ్ కార్యక్రమం పోస్టర్‌ను గురువారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ జిల్లా సమన్వయకర్త డా.కింజరాపు అమ్మన్నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యోగా సాధకులు వారణాశి సందీప్, సురేంద్ర, శేఖర్, రామాధర్, స్వప్న, రామారావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

కోటబొమ్మాళి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీని దంత గ్రామంలో మండల పరిషత్ పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్య సిబ్బంది గురువారం నిర్వహించారు. క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే చికిత్స అందించి నివారించేందుకు అవకాశం ఉంటుందని సీహెచ్‌వో చంద్ర శేఖర్ అన్నారు. హెచ్‌ఎం గొండు నారాయణరావు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకుంటే నివారణ సాధ్యం

ఎల్.ఎన్.పేట, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యాన్ని కలిగించే వ్యాధుల్లో క్యాన్సర్ ఒకటని ముందస్తుగా గుర్తించి తగు చర్యలు తీసుకుంటే నివారించవచ్చని వైద్యాధికారి సునీత అన్నారు. లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పోలవరం విద్యార్థులు

టెక్కలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలక పోలవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామ ఉపా ధ్యాయుడు జగదీశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 విభాగంలో రోప్ స్కిప్పింగ్‌కు ఎం.యోగేశ్వరరావు ఎంపికయ్యాడన్నారు. కడపలో జరగబోయే అండర్-14 విభాగం రగ్బీ క్రీడలో కె.శిరీష, కె.అభిషేక్, ఎ.వరుణ్ పాల్గొంటారన్నారు. అలాగే 9, 10, 11 తేదీల్లో విశాఖపట్నంలో అండర్- 14 విభాగంలో జరుగు నెట్‌బాల్ పోటీకి సాహు కాజల్, ఎం.చరణ్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఓటరు జాబితాల్లో తప్పులను సరిచేయండి

పోలాకి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ దృష్ట్యా గతంలో నమోదు చేసిన ఓటర్ల జాబితాల్లో తప్పులను సరిచేయాలని, మృతులు, వలసలు ఉంటే వారి పేర్లను తొలగించాలని తహసీల్దార్ ఎం.సురేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం రెవెన్యూ కార్యాలయ సమావేశ మందిరంలో వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటి సంఘాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. తుది జాబితాను శుక్రవారం సాయంత్రానికి అందించాలన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును వెనక్కు తీసుకోండి

అరసవల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల పెంపును తక్షణం ఉపసంహరించాలని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఈ కార్యాలయం ఎదుట పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతి రేకంగా పీసీసీ ఆదేశాల మేరకు పార్టీ జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్ర మంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, కేవీ ఎల్ఎస్ ఈశ్వరి, తెంబూరు మధుసూదనరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు మూసివేయాలి

రణస్థలం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జనవాసాల్లో మద్యం దుకాణాలు మూసివేయాలని మహిళలు కోరారు. ఈ మేరకు పైడిభీమవరానికి చెందిన మహిళలు గురువారం మద్యం దుకాణాల వద్ద నిరసన తెలిపారు. పైడిభీమవరంలో జనావాసాల్లో ఒకే చోట మూడు దుకాణాలు ఉండ డంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. మద్యం షాపులను గ్రామానికి దూరం ఏర్పాటు చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని మహిళలు తెలిపారు. కాగా ఎటువంటి అభ్యంతరం ఉన్నా తనకు ఫిర్యాదు చేయాలని ఎక్సైజ్ సీఐ అనురాధ తెలిపారు.

బీచ్ అభివృద్ధికి స్థల పరిశీలన

వజ్రపుకొత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి శివసాగర్‌బీచ్ అభివృద్ధికి స్థలాన్ని గురువారం తహసీల్దార్ సీతారామయ్య పరిశీలించారు. పర్యాటక శాఖ సౌజన్యంతో 5 ఎకరాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాన్ని గుర్తించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటరావు, వీఆర్వో ఇందిర, మోహనరావు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి

- పీఆర్ డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్

పలాసరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 'గ్రామ, పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక'పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేస్తున్న నిధులను సద్వినియోగం చేసి పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. పంచాయతీకి వచ్చే 15వ ఆర్థిక సంఘం, జనరల్, జలజీవన్ మిషన్, ఎస్‌డీఎం నిధులతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. దేనికి ఏ నిధులు ఖర్చుపెడుతున్నారో రికార్డుల్లో రూపొందించాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలు, బిల్లుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవోలు ఐవీ రమణ, గోపీబాల, ఎంపీడీవోలు వసంత్‌కుమార్, రమేష్ నాయుడు, పైల సూర్యనారాయణ, రాజారావు, టీవోటీ ఆనందరావు, సమీర్‌ఖాన్, సాగర్ కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీఆర్ డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్

ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

అరసవల్లి/శ్రీకాకుళం రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో శ్రీకాకుళం నుంచి పలాస వెళ్లే పాసింజర్ బస్సును గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ● మహిళలకు ఆర్థికంగా చేయూత అందించడంతో పాటు ప్రతి ఇంట్లో వెలుగులు నింపేందుకు కూటమి ప్రభుత్వం దీపం పథకానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. దమ్మల వీధిలో గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేశారు. ● ఆచార్య ఎన్జీ రంగా రైతు బాంధవుడిగా పేరు గాంచారని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. రంగా జయంతి పురస్కరించుకుని శాంతినగర్ కాలనీలోని ఆయన విగ్రహాన్ని మాజీ మంత్రి త్రిపురాన వెంకటరత్నంతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు, జామి భీమశంకర్, నటుకుల మోహన్, కొంక్యాన వేణుగోపాల్ పాల్గొన్నారు. ● ప్రతి ఇంటికి జల్ జీవన్ మిషన్ ద్వారా తాగు నీరందిం చడమే ధ్యేయమని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం కిష్టప్పపేటలో జల్‌జీవన్ మిషన్ ద్వారా జరుగుతున్న పనులను పరిశీలించారు.



కొత్త బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

టెక్కలి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టెక్కలి టౌన్-5 ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దశివాలయం వీధి, కండ్రవీధి, బన్నువాడ రోడ్డు, పెద్ద కరెంటు ఆఫీస్ ఏరియాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వజ్రపుకొత్తూరు మండలంలో..

వజ్రపుకొత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పూండి అక్కుపల్లి, వజ్రపుకొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్లకు ఇరువైపులా పెరిగి పోయిన చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ వైర్లు సరి చేసే పనులు చేపడుతున్నందున ఈ సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నామని, గమనించి సహకరించాలని కోరారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు

వజ్రపుకొత్తూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ మల్లికార్జునరావు అన్నారు. గురువారం నువ్వలరేవు, మంచినీళ్లపేట, పల్లిసారథి గ్రామాల్లో పర్యటించి స్థానిక గ్రామపెద్దలతో మాట్లాడారు. నిబంధనలు అతిక్రమిస్తే షాపు లైసెన్సులు రద్దు చేస్తామన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేయండి

పలాస, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో పేదలకు కేటాయించిన ఇళ్ల నిర్మాణాల పూర్తికి సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు కోరారు. ఈ మేరకు గురువారం కార్యాలయ సమావేశ మందిరంలో అర్బన్ హౌసింగ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇళ్లకు తక్షణం బిల్లులు చెల్లించాలని ఆదేశించారు.